హరితహారానికి మొక్కలు సిద్ధం

- 17గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు
- ఈ ఏడాది 1.50లక్షలు నాటడమే లక్ష్యం
- ఇప్పటికే గుంతలు తీస్తున్న కూలీలు

చిలుకూరు : హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా 17గ్రామపంచాయతీల్లో 17నర్సరీలను ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో 2లక్షల పైగా మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1.50లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని చిలుకూరు, రామాపురం వననర్సరీల్లో 70 శాతం మొలకశాతం ఉండగా మిగిలిన గ్రామాల్లోని నర్సరీల్లో నాటేందుకు వీలుగా మొక్కలు ఎదిగాయి. ఆయా నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలు, టేకు, కర్జూరా, చింత తదితర మొక్కలు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామపంచాయతీల్లో కనీసం 6వేల నుంచి 15వేల మొక్కలను పెంచుతున్నారు.

తొలకరి వర్షాలు కురుస్తుండడంతో..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో హరితహారంలో భాగంగా మొక్కలు నాటడానికి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో పది రోజుల్లో మొక్కలు నాటాలని ఇప్పటికే ఉపాధికూలీలతో గుంతలు సైతం తీయిస్తున్నారు. ప్రతి గ్రామంలో వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది బేతవోలు రోడ్డులో కొండాపురం స్టేజీ నుంచి కొండాపురం మీదుగా మాధవగూడెం రోడ్డులో, బేతవోలు నుంచి చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం రోడ్డు వెంట మొక్కలు నాటాలని ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రోడ్ల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాలు, గుట్టల్లో మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.


నాటేందుకు నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం


వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. మండలంలోని 17గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. ఈ నర్సరీల్లో 2లక్షలకు పైగా మొక్కలు పెంచుతున్నాము. ప్రస్తుతం మొక్కలు నాటే దశకు ఎదిగాయి. ఆయా నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలు, టేకు, కర్జూర, చింత తదితర మొక్కలు ఉన్నాయి. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1.50లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు

మంత్రి సహకారంతో గ్రామాల అభివృద్ధి

గరిడేపల్లి : మండలంలోని ప్రతి గ్రామాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్బీనగర్‌లో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామానికి సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. వేసవికాలంలో మంచినీటి ఇబ్బందులను తొలగించేందుకు రూ.98లక్షల నిధులను మంత్రి ఉత్తమ్ మంజూరు చేయించారన్నారు. దీంతో ప్రతి గ్రామంలో బోర్లు వేయించామన్నారు. మంత్రి సహకారంతో మండలంలోని మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, వెంకటరెడ్డి, చిరంజీవి, నర్సిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


హుజూర్‌నగర్‌రూరల్ : పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి గిరిజాకుమారి

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రత్యేక అధికారి తుమ్మల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బూరుగడ్డలో గ్రామకార్యదర్శి మంత్రిప్రగడ గిరిజాకుమారితో కలిసి పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఇటీవల 10డెంగీ కేసులను గుర్తించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునగాల : ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీశైలం కోరారు. ఆదివారం రేపాల పీహెచ్‌సీ పరిధిలోని తాడువాయి గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఆయా వార్డుల్లోని డ్రెయినేజీలను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం డ్రెయినేజీల్లో, నీటి నిల్వ ప్రాంతాలలో దోమల మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రధానంగా దోమల ద్వారా పలు జబ్బులు వచ్చే అవకాశం ఉన్నందున దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.వినయ్‌కుమార్, వైష్ణవి, జాతీయ కీటక జనీత నివారణ ప్రోగ్రాం సబ్ యూనిట్ అధికారులు ఎం.సుదర్శన్, షాబుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ, ఏఎన్‌ఎంలు సుచరిత, మమత, ఆశవర్కర్లు, మలేరియా ఫీల్డ్‌వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మునగాల : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్న వైద్యాధికారి శ్రీశైలం

ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓలకు సన్మానం


మఠంపల్లిలో ఎంపీడీఓ జానకిరాములు దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మఠంపల్లి : మండల ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓ జానకిరాములను ఆదివారం మండల కేంద్రంలో ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ పాల్గొని మాట్లాడారు. మండలంలో గిరిజనుల ప్రతి సమస్య పరిష్కరించేందుకు ఎంపీడీఓ ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ ఎం.కొండానాయక్, ఎంపీటీసీలు బి.సైదమ్మ, ప్రభుదాసు, జి.సైదమ్మ, సీహెచ్ నాగిరెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయ పీఆర్‌ఓ కిష్టపాటి వెంకటరెడ్డి, ఏపీఓ ఉమాదేవి, ఏపీఎం సౌజన్య, మణి, చప్పిడి భిక్షం, ధర్మయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, చంటి, కోటిరెడ్డి, సుధాకర్, సీతారామయ్య, ఉమా, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్, నాగేశ్వరరావు, మట్టయ్య, తదితరులున్నారు.

గరిడేపల్లి : మండల ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వనజను ఆదివారం మండల కేంద్రంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు తమ విధులను అందరి సహకారంతో నిర్వహించిన చోట గుర్తింపు పొందుతారని అన్నారు. అనంతరం ఎంపీడీఓ వనజ దంపతులను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెన్‌పహాడ్ మాజీ ఎంపీపీ తూముల భుజంగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి, ఎంపీటీసీలు బాల్దూరి సందీప్, పరమేష్, చాంద్‌మియా, వెంకట్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఎంపీడీఓ లావణ్య, మండల విద్యాధికారి చత్రునాయక్, ఎంపీఓ మౌలానా, సూపరింటెండెంట్ అబ్దుల్ సుభాని, ఏపీఓ సురేష్, ఈసీ సుజాత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : ఎంపీడీఓ వనజను సన్మానిస్తున్న ఎంపీపీ దంపతులు

నిధులు మంజూరు చేయడంపై హర్షం

అనంతగిరి : మండలంలోని పలు అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్ సహకారంతోఎమ్మెల్యే పద్మావతిరెడ్డి నిధులు మంజూరు చేయించడం పట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి చనుపల్లి, అమీనాబాద్ నుంచి నడిగూడెం వరకు డబుల్‌లైన్ రోడ్ల ఏర్పాటుకు రూ.45కోట్ల నిధులు, అదే విధంగా అనంతగిరి నుంచి చనుపల్లి గ్రామానికి 33కేవీ విద్యుత్ లైన్‌ను మంజూరుకు నిధులు, శాంతినగర్‌లోని ఉత్తమ్‌పద్మావతిరెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.5కోట్ల 30లక్షలతో లిఫ్ట్ మరమ్మతు పనులకు టెండర్లు వేయడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఇంపాక్ట్ క్లబ్ అవార్డు అందజేత


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు పదోతరగతిలో ఫలితాల్లో 10జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా వారికి ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నేరేడుచర్ల హరివిల్లు అధ్యక్షురాలు, సర్టిఫైడ్ ట్రైనర్ వీరవల్లి శ్రీలత, శ్రీవాణి స్కూల్ డైరెక్టర్ కొణతం సీతారాంరెడ్డి ఆదివారం అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంపా నాగేశ్వర్‌రావు సమాజంలో విజ్ఞానాన్ని పంచడం, బిజినెస్ ప్రమోషన్, భావితరాల భవిష్యత్‌ను గొప్పగా ఎలా తీర్చిదిద్దుకోవాలనే ఉద్దేశంతో ఈ క్లబ్‌లను స్థాపించినట్లు తెలిపారు. కాగా నేరేడుచర్లలోని అంజలి, ప్రగతి, శ్రీవాణి, పినాకిల్, బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు శరన్, తేజ్, లక్ష్మీప్రియ, మహేశ్వరి, అశ్లేష, జూనైనా, యశస్వీ, సిరి, వైష్ణవి, ఉపేంద్ర, శ్రావణి, సాయివర్షిణి, నవ్యకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు బట్టు మధు, పాలిశెట్టి శ్రీధర్, పినాకిల్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఎస్‌కె మధార్, రాచకొండ శేఖర్‌రావు, రాచకొండ శ్రీనివాస్‌రావు, వీరవల్లి కోటేశ్వర్‌రావు, కొత్త లక్ష్మణ్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, యడవల్లి సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

‘రైతుభరోసా’ అమలుపై అభిప్రాయ సేకరణ

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం అమలుపై రైతుల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సంధ్యారాణి పాల్గొని మాట్లాడారు. సాగు చేసే భూములకు మాత్రమే పథకాన్ని వర్తింపజేయాలని, పంటలు సాగు చేసే ముందే పెట్టుబడి సాయాన్ని ఒకే విడతలో మంజూరు చేయాలని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంటా సుధాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రీతంకుమార్, సహకార శాఖ అధికారులు చంద్రకళ, కేవీకే డైరెక్టర్ గంట అమరేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి పాల్గొని రైతుల నుంచి పథకం అమలుపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. పది ఎకరాలలోపు వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా సాయం అందించాలని ఎక్కువ మంది రైతులు అభిప్రాయం తెలిపినట్లు ఆమె వెల్లడించారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి నాయకులకు అవసరంలేదని, పారిశ్రామికవేత్తలకు, ఫామ్‌హౌజ్ కట్టుకున్న వారికి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవసరం లేదని మండల రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గతంలో ఎన్నెస్పీ కాలువల భూములకు, గ్రామ కంఠాలు, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములకు రైతుబంధు అక్రమంగా పొందినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు చోటు లేకుండా ఖచ్చితమైన సాగు రైతులకు మాత్రమే రైతుబంధు సాయం అందేలా అధికారులు, ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ వెంకట్‌రెడ్డి, ఏఈఓలు శ్రీకాంత్, వెంకటేష్, శారద, రైతులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : సమావేశంలో పాల్గొన్న ఏడీఏ సంధ్యారాణి, రైతులు

రైతు భరోసాపై నేడు అభిప్రాయ సేకరణ

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకంపై స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో జూలై 1న అభిప్రాయ సేకరణకు సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దొండపాటి అప్పిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక పీఏసీఎస్ అవరణలో నిర్వహించే అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు హాజరవుతున్నారని, రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు.

మునగాల : మండల కేంద్రంలో గల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించే మహా జనసభలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సొసైటీ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీఈఓ బసవయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహా జనసభలో రైతుభరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సభలో రైతులు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.


పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

నడిగూడెం : ఎలాంటి షరతులు లేకుండా రైతుభరోసా ఇవ్వాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ సాగుకు రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయని, దీంతో అప్పులు చేస్తూ సాగు చేస్తున్నారని అన్నారు. రాయితీలపై వ్యవసాయ పరికరాలు మంజూరు చేయాలన్నారు.

క్షతగాత్రులకు ఆర్థికసాయం అందించాలి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులోని జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరు క్షతగాత్రులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15లక్షల ఆర్థికసాయం అందించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట పట్టణానికి చెందిన అడిదెల రామచంద్రారెడ్డి -అనసూయమ్మ దంపతుల కుమార్తె వినీష, కుమారుడు సతీష్‌రెడ్డి బరాఖత్‌గూడెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారి చికిత్స కోసం ఇప్పటి వరకు తల్లిదండ్రులు రూ.15లక్షలు ఖర్చు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.15లక్షలు మంజూరు చేయించే విధంగా జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కందుల వీరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు గోకుల శేఖర్‌రెడ్డి, మునగాల మండల అధ్యక్షుడు జి.మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన రేషన్‌కార్డులను జారీ చేయాలి

నేరేడుచర్ల : తెలంగాణ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని బొడలదిన్న గ్రామంలో నిర్వహించిన సీపీఐ, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రధానంగా రేషన్‌కార్డు ఎంతో అవసరమన్నారు. గత ప్రభుత్వం 10ఏళ్ల పాటు అధికారంలో ఉండి కూడా రేషన్‌కార్డులు ఇవ్వలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయడంతో పాటు అర్హులైన వారందరికీ నూతనంగా రేషన్‌కార్డులను అందించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, రైతు సంఘం నాయకులు యల్లబోయిన వెంకన్న, యల్లబోయిన నర్సయ్య, దామరచర్ల సైదులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

విద్యుత్ మరమ్మతులకు సహకరించాలి

కోదాడరూరల్ : వర్షకాలంలో వస్తున్న విద్యుత్ సమస్యల మరమ్మతులకు మండల ప్రజలు సహకరించాలని కోదాడ టౌన్ విద్యుత్ ఏఈ మల్లెల శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. శనివారం రాత్రి వీచిన భారీ గాలులతో బాలాజీనగర్ 11కేవీ ఫీడర్‌లో బ్రేక్‌డౌన్ కారణంగా విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలిగిందని, అయినా అర్ధరాత్రి 12గంటల వరకు తమ సిబ్బందితో పనిచేయించి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుందాం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : కమ్మ కులస్తులందరూ సమన్వయంతో ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని కమ్మ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డు రవీందర్‌రావు, జీవీఎస్‌కె ప్రసాద్, కోశాధికారి కండెపు రత్నాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కల్యాణ మండపంలో నిర్వహించిన కోదాడ కాకతీయ సేవా సమితి వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కల్యాణ మండప నిర్మాణ స్థితిగతులు, కల్యాణ మండపంలో ఏర్పాటు చేయాల్సిన మహాదాతల పేర్లు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మాణాలు చేసి ఆమోదించారు. అనంతరం కాకతీయ సేవా సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెదనాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి సురేష్, కోశాధికారిగా పోటు రంగారావును ఎన్నుకున్నారు. సమావేశంలో రావెళ్ల సీతరామయ్య, మాధవరావు, నాగేశ్వరరావు, అనంతరాములు, నాగేంద్రప్రసాద్, రాంబాబు, శ్రీనివాసరావు, సుబ్బారావు, భ్రమరాంబ ఉన్నారు.

గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి


నిల్వ ఉన్న వర్షపు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న తుమ్మ సతీష్ తదితరులు

మునగాల : మండలంలోని రేపాల గ్రామపంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని తక్షణమే సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యుడు తుమ్మ సతీష్ కోరారు. ఆదివారం ఆయన గ్రామంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడారు. వర్షం వస్తే పలు వీధుల్లో నీరు మోకాళ్ల లోతు నిలుస్తున్నాయన్నారు. చిన్న వర్షం పడినా ఈ ఇబ్బందులు తప్పడం లేదని, దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషిచేయాలన్నారు. నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, లేనియెడల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాతంగి తిరపయ్య, ఎర్ర వెంకన్న, మాచర్ల ఉపేందర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి

నడిగూడెం : మండల కేంద్రంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని వాగు, పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. సంబంధిత అధికారులు స్పందించి, ప్రస్తుత సీజన్‌లో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట లతీఫ్, బండారు శోభారాణి, ప్రసాద్, జయమ్మ, స్థానికులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


హుజూర్‌నగర్ : ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లు అందజేస్తున్న స్నేహితులు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కస్తాల మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. మహేష్ నిరుపేద కావడంతో అతడితో పాటు పదోతరగతి చదివిన మిత్రులు రూ.1.65లక్షలను జమచేసి పిల్లల పేర్లమీద ఫిక్స్ డిపాజిట్ చేశారు. సదరు డిపాజిట్ ధృవపత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు తేలుకుంట్ల శ్రీనివాస్, అశ్వినికుమార్, ఒక్కవంతుల గౌతం, లక్ష్మి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన చారు నర్సయ్య (55) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ఆదివారం అదే గ్రామానికి చెందిన జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మృతుడికి కుటుంబానికి రూ.15వేల నగదుతో పాటు 25కిలోల బియ్యం అందజేశారు.

క్లుప్తంగా

సీపీఎంలో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మట్టిపెల్లి సైదులు

మోతె : మండల కేంద్రానికి చెందిన ఎల్లబోయిన రామ్మోహన్, మొగిలి ఉపేందర్ ఆయా పార్టీలకు రాజీనామా చేసి ఆదివారం సీపీఎంలో చేరారు. స్థానికంగా వారికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాపోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం శుభసూచికమన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడేది కేవలం సీపీఎం అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ములుకూరు గోపాల్‌రెడ్డి, కొక్కిరేణి సత్యనారాయణ, కిన్నెర పోతయ్య, దోసపాటి శ్రీనివాస్, జంపాల స్వరాజ్యం, ఎడమ పద్మ, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నికకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మార్కండేయ

హుజూర్‌నగర్ : పట్టణంలో పద్మశాలి సంఘం ముఖ్య నాయకుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మార్కండేయ పాల్గొని మాట్లాడారు. పట్టణ ప్రస్తుత కమిటీని రద్దు చేస్తున్నట్లు, ఆగస్టు 1న సంఘం నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు అందుకు సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పి.నరసింహ, ఎస్.కుమార్ స్వామి, సీహెచ్.అంజయ్య, ఎం.యాదిగిరి, ఎం.వెంకటేశ్వర్లు, వెంకన్న, వీరమల్లు, సత్యనారాయణ, గోవిందరావు, యాదగిరి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు సన్మానం


ఎస్‌బీఐ మేనేజర్‌ను సన్మానిస్తున్న ఖాతాదారులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ శాఖ మేనేజర్‌గా పనిచేస్తున్న ఫణికుమార్ బదిలీపై వెళ్తుండడంతో ఆయనను బ్యాంకు ఖాతాదారులు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేశరాజు వినాయకరావు, కేశరాజు లక్ష్మి, బొడ్డుపల్లి సుందరయ్య, రాచకొండ రవికుమార్, చిలుకూరి ఉపేందర్ తదితరులున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భోజనం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన టీఎన్‌యూసీ నాయకుడు రోషపతి, మణిల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని అనాథ శరణాలయంలో చిన్నారులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో జాన్‌పాల్, వెంకన్న, రవి పాల్గొన్నారు.